జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com



## అభ్యుదయం సైకిల్ యాత్ర..
# ప్రజా చైతన్య యాత్ర



**శ్రీకాకుళం, డిసెంబర్ 16 (వార్త):** మంచి సమాజ నిర్మాణం.. మంచి వ్యక్తుల వల్లనే సాధ్యమవుతుందని విశాఖ రేంజ్ డీఐజీ గోపినాథ్ జట్టి అన్నారు. మత్తు పదార్థాల నియంత్రణకు గాను పాయకరావుపేట నుంచి ఇచ్ఛాపురం వరకూ పోలీసుల ఆధ్వర్యంలో అభ్యుదయ ర్యాలీని నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజలను చైతన్యం చేసేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని చెప్పారు. పాయకరావుపేటలో ప్రారంభమైన ర్యాలీ మంగళవారం శ్రీకాకుళం నగరంలోకి చేరుకుంది. రామలక్ష్మణ జంక్షన్ వద్ద ఈ ర్యాలీని డీఐజీ ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఎమ్మెల్యేలు గొండు శంకర్, కూన రవికుమార్, బగ్గు రమణమూర్తితో పాటు పెద్ద ఎత్తున యువత ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ యాత్ర రామలక్ష్మణ జంక్షన్ వద్ద ప్రారంభమై సూర్యమహల్, జీటీరోడ్డు, సెవెన్ రోడ్డు జంక్షన్ మీదుగా ఎన్టీఆర్ మున్సిపల్ మైదానం వరకూ సాగింది. అనంతరం ఎన్టీఆర్ మున్సిపల్ మైదానంలో ఏర్పాటు బహిరంగ సభ నిర్వహించారు. విద్యార్థుల ఫ్లాష్‌మాబ్, జానపద నృత్య కళా ప్రదర్శనలు, తప్పెటగుళ్ల తదితర కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. డ్రగ్స్ వద్దు బ్రో, తదితర సైకత శిల్పాలు అలరించాయి. బహిరంగ సభలో డీఐజీ గోపీనాథ్ జట్టి మాట్లాడుతూ గంజాయి, మాదకద్రవ్యాల నిర్మూలనపై 'అభ్యుదయం సైకిల్ యాత్ర' ద్వారా ప్రజలను, యువతను, విద్యార్థులను మమేకం చేసుకుంటూ శ్రీకాకుళం జిల్లా పోలీసుల విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. గంజాయి, మత్తు పదార్థాలు లేని సమాజ నిర్మాణమే లక్ష్యంగా ఈ యాత్ర సాగుతోందన్నారు. గంజాయి నిర్మూలన, వినియోగం వలన కలిగే దుష్ప్రభావాలు, అనర్థాలపై ప్రజల్లో అవగాహన, చైతన్యం కల్పిస్తున్నామన్నారు. ప్రభుత్వం ఎన్నో చర్యలు తీసుకుంటున్నప్పటికీ, ప్రజల భాగస్వామ్యం అత్యంత అవసరమన్నారు. డ్రగ్స్ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలన్నారు. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో తొలిసారిగా గంజాయి నిర్మూలన లక్ష్యంగా ప్రారంభించిన అభ్యుదయం సైకిల్ యాత్రకు విశేష స్పందన లభిస్తోందని తెలిపారు. మన దేశంలో డ్రగ్స్ సమస్య తీవ్రంగా ఉందని, దాని నిర్మూలనకు దృఢ సంకల్పంతో పనిచేస్తున్నామని పేర్కొన్నారు. ఈ అభ్యుదయం సైకిల్ యాత్ర ముగింపు కార్యక్రమం ఈ నెల 29వ తేదీన ఇచ్ఛాపురంలో ఉంటుందన్నారు. జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి మాట్లాడుతూ విశాఖపట్నం రేంజ్ పరిధిలో పాయకరావుపేటలో రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత, రేంజ్ డీఐజీ ప్రారంభించిన ఈ సైకిల్ యాత్ర నెలరోజుల పాటు కొనసాగి జిల్లాకు చేరుకున్నదని తెలిపారు. ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం గంజాయి నిర్మూలనతో పాటు మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై ప్రజల్లో అవగాహన కల్పించడమని పేర్కొన్నారు. నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలు వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ మాట్లాడుతూ డ్రగ్స్ బారిన పడిన యువతను రక్షించి, సరైన మార్గంలో నడిపించాల్సిన బాధ్యత సమాజం మొత్తానిదన్నారు. శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ డ్రగ్స్ తీసుకోవడం వల్ల జీవితాలు నాశనమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ పీహెచ్ తిరుపతి నాయుడు, అదనపు ఎస్పీ పి శ్రీనివాసరావు, శ్రీకాకుళం ఆర్డీవో సాయి ప్రత్యూష, డీఎస్పీలు వివేకానంద, లక్ష్మణరావు, డీసీఎంఎస్ చైర్మన్ అవినాష్, ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు, ఉద్యోగులు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.





* పాయకరావుపేట నుంచి ఇచ్ఛాపురం వరకూ అవగాహన ర్యాలీ
* మాదకద్రవ్యాల నిర్మూలనే లక్ష్యంగా కార్యక్రమాలు
* విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి
* శ్రీకాకుళం నగరంలో భారీ ర్యాలీ
* ఎన్టీఆర్ మున్సిపల్ మైదానంలో బహిరంగ సభ
* అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు




## మదనాపురంలో.. బాంబుల మోత

* పట్టపగలు క్వారీలో రాళ్లు పేల్చివేత
* గ్రామస్థులపై రాళ్ల దాడి
* రాజకీయ అండదండలతో పేట్రేగిపోతున్న క్వారీ యాజమాన్యం
* చోద్యం చేస్తున్న అధికార యంత్రాంగం
* ఆందోళనకు గురవుతున్న గ్రామస్థులు









**కొత్తూరు, డిసెంబర్16(వార్త):** కొత్తూరు మండలంలోని మదనాపురం పంచాయతీ పరిధిలోని ఒక క్వారీ యజమానుల తీరు వివాదాస్పదంగా మారింది. చట్టాలను తుంగలో తొక్కుతూ పట్టపగలే భారీ పేలుళ్లు చేస్తూ ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నారు. ఈ బ్లాస్టింగ్ ప్రభావంతో పొలాల్లో పనిచేస్తున్న రైతులపై భారీ రాళ్లు పడి పలువురు గాయపడుతున్నారు. మంగళవారం ఉదయం క్వారీ పక్కనే పొలాల్లో పనులు చేసుకుంటున్న బైరి భానుమతితో పాటు ఇంకొందరిపై అకస్మాత్తుగా పెద్ద రాళ్లు తగడంతో తీవ్ర గాయాలపాలయ్యారు. ఎటువంటి ముందస్తు హెచ్చరికలు లేకుండా పేలుళ్లు జరపడం స్థానికుల్లో ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. గాయపడిన వారిని గ్రామస్థులు తక్షణమే 108 అంబులెన్స్ ద్వారా చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న కొత్తూరు ఎస్.ఐ. కె.వెంకటేశ్ సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ ప్రారంభించారు. అయితే గ్రామస్థులు కొందరు తమ ఆవేదనను మీడియా ముందుంచారు. ఈ క్వారీపై గతంలో ఎన్నోసార్లు ఫిర్యాదు చేసినా ఎవరూ స్పందించడం లేదన్నారు. పట్టపగలు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా బ్లాస్టింగ్‌లు చేస్తున్నారన్నారు. ఈ క్వారీ నిర్వాహకులకు రాజకీయ నాయకుల అండదండలు ఉండడంతో అధికారులు సైతం మౌనం దాలుస్తున్నారని వాపోయారు. అధికార పార్టీకి చెందిన కొంతమంది కీలక నేతలు ఈక్వారీలో భాగస్వాములుగా ఉన్నారన్నారు. ఈ విషయమై ముఖ్యమంత్రి కార్యాలయానికి ఫిర్యాదు చేస్తామని గ్రామస్థులు కొందరు చెబుతున్నారు.

## మిల్లర్లు దోచేస్తున్నారు!

* తేమ, తరుగు పేరిట రైతుల నుంచి అదనంగా ధాన్యం వసూలు
* పట్టించుకోని అధికార యంత్రాంగం
* దళారులను ఆశ్రయిస్తున్న అన్నదాతలు





**ఎల్‌ఎన్‌పేట, డిసెంబర్ 16(వార్త):** ఖరీఫ్ ప్రారంభం నుంచే రైతులకు కష్టాలు వెంటాడుతున్నాయి.. ఆరుగాలం శ్రమించి రైతులు పండించిన వరి పంటను అమ్ముకునేందుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసినప్పటికీ మిల్లర్లు మాత్రం రైతులను దోచుకుంటునే ఉన్నారు. తరుగు, తేమ పేరుతో బస్తాకు 4 నుంచి 5 కేజీల వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్లో వరిపంట బాగా దిగుబడి వచ్చిందని ప్రభుత్వం నుంచి మంచి ధర రైతులకు ఇస్తుందని ఎంతో ఆశతో ఉన్న వారికి నిరాశ తప్పడం లేదు. ప్రభుత్వం ఆదేశాల మేరకు మండలంలోని ఏఏ రైతు సేవా కేంద్రం ద్వారా ఎన్నెన్ని ధాన్యం బస్తాలు కొనుగోలు చేశారన్నది ఆ పెరుమాళ్‌కే ఎరుక. రైతులు ధాన్యంతో మిల్లులకు వస్తే మా లెవీ లక్ష్యం అయిపోయిందన్న సమాధానం వస్తుండడంతో ఏం చేయాలో తెలియక, ఎవరికి విక్రయించాలో తెలియక దళారులను ఆశ్రయిస్తున్నారు. కొంత మంది రైతులు ప్రభుత్వం అనుమతి ఇచ్చిన మిల్లుల వద్దకు ధాన్యం తీసుకువెళ్తే తేమ శాతం ఎక్కువ ఉంది తాము కొనుగోలు చేయలేమని చెప్పేస్తున్నారు. గత పది రోజుల క్రితం ఎల్‌ఎన్‌పేట మండలంలోని స్కాట్ పేట, రావిచంద్రి, ఎల్‌ఎన్ పేట తదితర రైస్ మిల్లులను జాయింట్ కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులకు ఇబ్బంది లేకుండా మిల్లర్లు ధాన్యం కొనుగోలు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. అనధికారంగా స్టాక్ ఉన్న పలు మిల్లర్లపై 6ఏ కేసు నమోదు చేయాలని సంబంధిత రెవెన్యూ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. అయినా ఇక్కడ మిల్లర్లకు ఇలాంటి కేసులు ఆనవాయితే.. అన్నట్టూ ఇక్కడ అధికారులు కూడా మిల్లర్లు చెప్పిందే వింటున్నారని వాదనలు వినిపిస్తున్నాయి. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి ఇలాఖాలోనే రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు.

## స్థలం ఆక్రమించేసి.. ఆపై దౌర్జన్యం

* ఆవేదన వ్యక్తం చేస్తున్న వ్యాపారి ఈశ్వరరావు



**పలాస, డిసెంబరు 16 (వార్త):** పలాస మండలం బొడ్డుపాడు రెవిన్యూ పరిధిలో ఉన్నటువంటి సర్వేనంబర్ 67/పిలో కొంతమంది ప్రైవేటు వ్యక్తులు తన స్థలం ఆక్రమించడమే కాకుండా దౌర్జన్యానికి పాల్పడుతున్నారని తాళాసు ఈశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఆ స్థలంపై ఇటీవల కోర్టులో కేసు వేసి ఇంజక్షన్ ఆర్డర్ తీసుకున్నానన్నారు. 30 ఏళ్ల క్రితం తాము సుభాష్ అనే వ్యక్తి వద్ద కొనుగోలు చేసి పక్కా రిజిస్ట్రేషన్ చేసుకున్నానని, పాసు పుస్తకాలు, 1బిలు కలిగి ఉన్నామని తెలిపారు. అయితే కొందరు వ్యక్తులు తమ స్థలాన్ని ఆక్రమించేందుకు చూస్తున్నారని వాపోయారు. న్యాయం కోసం మరోసారి కోర్టును ఆశ్రయిస్తానని ఈశ్వరరావు తెలిపారు. కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

### టీడీపీ శ్రీకాకుళం పార్లమెంట్
## నియోజకవర్గ అధ్యక్షుడిగా రమేశ్

**శ్రీకాకుళం, డిసెంబర్ 16 (వార్త):** తెలుగుదేశం పార్టీ శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడిగా మొదలవలస రమేశ్‌ను నియమించనున్నట్టు తెలిసింది. బుధవారం ఆయన పేరును ఖరారు చేసే అవకాశం ఉంది. ఆమదాలవలసకు చెందిన రమేష్ పార్టీలోని పలు విభాగాల్లో సేవలు అందించారు. తెలుగు యువత అధ్యక్షుడిగా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, జిల్లా పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి, పార్టీ కార్యాలయ ఇన్‌ఛార్జిగా పనిచేశారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## ఉపాధ్యాయినిలకు క్రీడా పోటీలు

**పలాస, డిసెంబరు 16(వార్త):** విద్యాశాఖ ఆధ్వర్యంలో పలాస క్రీడా మైదానంలో మంగళవారం డివిజన్ స్థాయి మహిళా ఉపాధ్యాయులకు త్రోబాల్ పోటీలు నిర్వహించారు. ఇందులో వజ్రపుకొత్తూరు, పలాస మండలాల జట్లు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. ఈ సందర్భంగా పలాస, వజ్రపూకొత్తూరు ఎంఈఓలు సీహెచ్.సత్యం, బివి రమణ మాట్లాడుతూ క్రీడా పోటీలు మహిళా ఉపాధ్యాయుల జీవనశైలిని ఉత్తేజపరుస్తాయని, వారిని బాలికల విద్యలో మరింత ప్రభావవంతంగా మారుస్తాయని చెప్పారు. భారతదేశంలో మహిళా ఉపాధ్యాయుల సంఖ్య 50% పైబడి ఉండటం వల్ల, ఇటువంటి కార్యక్రమాలు వారి సేవలను గుర్తించి ప్రోత్సహిస్తాయని తెలిపారు. ఇది వారి శారీరక ఆరోగ్యం, మానసిక స్థిరత్వం మరియు విద్యార్థులకు రోల్ మోడల్‌గా నిలబడటానికి సహాయపడుతుందని వారన్నారు. నందిగాం ఎంఈఓ చిన్నారావు, ప్రధానోపాధ్యాయులు పి.రవికుమార్, కె.హరిబాబు, కళ్యాణి హాజరయ్యారు. న్యాయ నిర్ణేతలుగా పి.తవిటయ్య, తోటారావు, సిహెచ్.పద్మలోచనం, ఎస్.రామారావు, ఎస్.చంద్రశేఖర్, సీహెచ్.రాంజీ, పి.గజేంద్ర, ఆర్.శ్రీనివాసరావు, బి.తిరుమల తదితరులు వ్యవహరించారు.



## రాంపురం సర్పంచ్ ధర్మారావు దాతృత్వం

### -ప్రభుత్వ పాఠశాలకు రూ.10వేల విరాళం



**మందస, డిసెంబరు 16(వార్త):** ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి ఓ సర్పంచ్ రూ.10వేలు విరాళం అందించారు.. గ్రామంలోని విద్యార్థుల సమస్యలు తెలుసుకున్న ఆయన పాఠశాల ఆవరణలో వంట గది నిర్మాణానికి ఈ విరాళం అందజేశారు. మరి కొద్ది రోజులు మాత్రమే తన పదవీ ఉండగా.. ఆయన చూపిన దాతృత్వానికి స్థానికులు అభినందనలు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మందస మండలంలోని ఉద్దాన ప్రాంతమైన రాంపురం పంచాయతీలోని తెలగగంగువాడ గ్రామంలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో వంటగది సమస్య ఉంది. దీని నిర్మాణానికి రాంపురం సర్పంచ్ పొట్టి ధర్మారావు ముందుకు వచ్చారు. గ్రామస్తుల సమక్షంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బొడ్డు ఉపేంద్రరావుకు పది వేల రూపాయల నగదును అందజేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు రామదాసు, గున్నయ్య, పి.నారాయణ, పాపారావు, ఎన్.నారాయణ, మోహనరావు, శ్యామలరావు, వెంకటరావు, శాంతారావు, మాధవరావు, సోమేశ్వరరావు, సంతోష్, ధనరాజు, శ్యామ్, ఉపాధ్యాయులు సార భాస్కరరావు, జయలక్ష్మి, రాణి, అంగన్ వాడీ, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## సక్రమంగా యూరియా పంపిణీ



**జి.సిగడాం, డిసెంబరు 16(వార్త):** రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సక్రమంగా యూరియా, ఎరువులు పంపిణీ చేయాలని టిడిపి మండల అధ్యక్షుడు రవికుమార్ పేర్కొన్నారు.మంగళవారం పున్నాం రైతు సేవా కేంద్రం పరిధి రైతులకు యూరియా ఎరువులను పంపిణీ చేశారు.ఎరువుల కోసం రైతులు వేచి ఉండకుండా చూడాలని సూచించారు. ఇటీవల యూరియా కొరత విషయముపై ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు,ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు దృష్టిలో పెట్టామని తెలిపారు. వారు జిల్లా అధికారులతో మాట్లాడారు.వారు స్పందిస్తూ అన్నదాతలకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. ఈ పంపిణీ కార్యక్రమంలో సర్పంచ్ సుంకరి నాయకులు అదిత్య రాజు వర్మ,అగ్రికల్చర్ అసిస్టెంట్ యుగంధర్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## రూ.6.552 కోట్లతో 36 ఆరోగ్య కేంద్రాల అభివృద్ధి

**పలాస, డిసెంబరు 16(వార్త):** కూటమి ప్రభుత్వ ప్రజా ఆరోగ్యంపై దృష్టి పెడుతూ 6.552 కోట్లతో మందస మండలంలో 15, పలాస మండలంలో 7, వజ్రపుకొత్తూరు మండలంలో 14 (విలేజ్ హెల్త్ క్లినిక్, బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్స్ మరియు ఇతర ఆసుపత్రులకు) అభివృద్ధికి గాను రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించింది. దీనిని పంచాయతీరాజ్, రోడ్లు, భవనాలు, ఏపీఎంసీడీసీ శాఖలు నిర్వహణ చేయనున్నాయి. త్వరలో నిర్మాణాలు పూర్తిచేసి ప్రజలకు మెరుగైన వైద్యం అందిస్తామని ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. పలాస నియోజకవర్గంలో వైద్య సేవలు విస్తరించే విధంగా, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు, కూటమి ప్రభుత్వములో ప్రజా ఆరోగ్య సదుపాయాలు మరింత బలోపేతం చేసే విధంగా చర్యలు తీసుకుంటున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కి నియోజకవర్గ ఎమ్మెల్యే గౌతు శిరీష ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలియజేశారు.

## స్వచ్ఛ హరిత విద్యాలయంగా కోమర్తి ప్రాథమిక పాఠశాల ఎంపిక




**నరసన్నపేట, డిసెంబరు 16(వార్త):** కోమర్తి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు విద్యాశాఖ నుంచి ప్రతిష్ఠాత్మక గుర్తింపు లభించింది. ప్రభుత్వ పాఠశాలల్లో స్వచ్ఛభారత్ కార్యక్రమాల అమలుపై ప్రభుత్వం ఇటీవల పలు బృందాలతో విస్తృతంగా పరిశీలనలు చేపట్టింది. ఈ పరిశీలనలలో భాగంగా కోమర్తి ప్రాథమిక పాఠశాలను సందర్శించిన అధికారుల బృందం, అక్కడ పరిశుభ్రత, పచ్చదనం, పరిసరాల సంరక్షణ, విద్యార్థుల్లో స్వచ్ఛతపై అవగాహన వంటి అంశాలను పరిశీలించి, పాఠశాలను స్వచ్ఛ హరిత విద్యాలయంగా గుర్తించింది. ఈ మేరకు విద్యాశాఖ మంగళవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు తెలిపారు. ఈ గుర్తింపు పాఠశాల ఉపాధ్యాయుల కృషికి, విద్యార్థుల భాగస్వామ్యానికి నిదర్శనమని వారు పేర్కొన్నారు. గ్రామస్థులు, తల్లిదండ్రులు పాఠశాల సిబ్బందిని అభినందించారు.

## అలరించిన ప్రకాష్ డప్పు వాయిద్యం

**సోంపేట, డిసెంబరు 16(వార్త):** అయ్యప్ప స్వామి పూజ భజనలలో మాల ధారణ లో ఉన్న గేదెల ప్రకాష్ డప్పు వాయిద్యంతో ఎంతగానో అలరింప చేస్తున్నారు. ప్రకాష్ డప్పు వాయిద్యానికి ఫిదా అయిన భక్తులు సోమవారం రాత్రి కవిటిలో గల సన్నిధానంలో ప్రకాష్ కు దుస్సాలువ కప్పి సన్మానం చేసి ఆయన సేవలను కొనియాడారు. రామారావు గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.



# పలాస కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పాటు చేయండి

### - ఉత్తర శ్రీకాకుళం ప్రజల దీర్ఘకాలిక ఆకాంక్ష నెరవేర్చండి

### - మద్దతు తెలిపిన వర్తక సంఘాలు



**పలాస, డిసెంబరు 16(వార్త):** పలాసను కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పాటు చేయడం ఉత్తర శ్రీకాకుళం ప్రజల దీర్ఘకాలిక ఆకాంక్షగా కొనసాగుతోందని పలాస జిల్లా సాధన కమిటీ స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో కాశీబుగ్గ వర్తక సంఘం ప్రముఖ పెద్దలు కే.వి. గోపాల్ ని జిల్లా సాధన కమిటీ సభ్యులు ప్రముఖ సామాజిక వేత్త, న్యాయవాది దువ్వాడ శ్రీధర్ (బాబా), ప్రముఖ వైద్యులు దువ్వాడ జీవతేశ్వరరావులు మర్యాదపూర్వకంగా కలిసి తమ డిమాండ్ లను వివరించారు. ఈ సమావేశంలో పలాసను జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయడం వల్ల పలాస, ఇచ్ఛాపురం, టెక్కలి, పాతపట్నం నియోజకవర్గాలకు పరిపాలనా వికేంద్రీకరణ సాధ్యమవుతుందని కమిటీ సభ్యులు తెలిపారు. జిల్లా ఏర్పాటు ద్వారా ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత సమీపంగా చేరతాయని, అభివృద్ధి పనులు వేగవంతమవుతాయని వారు వివరించారు. జిల్లా స్థాయి కార్యాలయాలు ఏర్పడటంతో వ్యాపార పరిశ్రమల విస్తరణకు విస్తృత అవకాశాలు ఏర్పడతాయని, విద్యా, వైద్య రంగాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. దీని ఫలితంగా స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు గణనీయంగా పెరుగుతాయని అభిప్రాయపడ్డారు. ప్రత్యేకించి వర్తక, రవాణా, రియల్ ఎస్టేట్, చిన్న మరియు మధ్యస్థ వ్యాపార రంగాలకు పలాస జిల్లా ఏర్పాటు వల్ల ప్రత్యక్ష లాభాలు చేకూరుతాయని కమిటీ సభ్యులు వివరించారు. ఈ లక్ష్యాన్ని సాధించడంలో వర్తక సంఘాల మద్దతు, మార్గనిర్దేశం మరియు సంఘటిత సహకారం అత్యంత కీలకమని వారు పేర్కొన్నారు. ఉత్తర శ్రీకాకుళం ప్రాంత సమగ్ర అభివృద్ధి దిశగా పలాస జిల్లా ఏర్పాటు ఒక చారిత్రాత్మక అడుగుగా నిలుస్తుందని, ప్రజా ప్రయోజనాల కోసం అన్ని వర్గాలు ఐక్యంగా ముందుకు రావాలని పలాస జిల్లా సాధన కమిటీ కన్వీనర్, సామాజికవేత్త, ప్రముఖ న్యాయవాది దువ్వాడ శ్రీధర్ (బాబా) విజ్ఞప్తి చేశారు.ఈయన తో పాటు జిల్లా సాధన కమిటీ సభ్యులు, వర్తక సంఘాలు తదితరులు పాల్గొన్నారు.

## స్వదేశీ నినాదం కాదు ..మన జీవన విధానం



**జి.సిగడాం, డిసెంబరు 16(వార్త):** యువత విదేశీ వస్తువుల మోజును తగ్గించుకోవాలని, ఇంటికి వాటిని తెచ్చుకునే సంస్కృతిని వదిలేయాలని, స్వదేశీ ఉత్పత్తులను ఆదరించాలని బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు పైల విష్ణుమూర్తి, ఎఎంసీ ఉపాధ్యక్షుడు బురాడ వెంకటరమణ పిలుపునిచ్చారు. మంగళవారం పెంట గ్రామంలో ఆత్మ నిర్భర్ భారత్ ప్రచార కార్యక్రమాన్ని పెంట, మెట్టవలస, సంతవురిటి,ఆనందపురం గ్రామాల పాఠశాల విద్యార్థులతో కలిసి ప్రతిజ్ఞ, ర్యాలీ నిర్వహించారు. యువతకు భారీగా ఉద్యోగావకాశాల కల్పనపై తమ ప్రభుత్వం దృష్టి సారించిందని తెలిపారు. స్వయం సమృద్ధి అనేది నేటి ప్రపంచంలో తప్పనిసరని అభిప్రాయపడ్డారు. యువత దేశీయ ఉత్పత్తులను ఆదరించాలని కోరారు. స్వదేశీ వస్తువులనే విక్రయిస్తామని వ్యాపారులు నిర్ణయం తీసుకోవడంద్వారా దేశభక్తిని చాటుకోవాలి. స్కిల్ ఇండియా ద్వారా కోట్ల మంది యువత నైపుణ్యం కలిగిన మానవ వనరులుగా మారుతున్నారు. చాలా దేశాలకు యువత కావాలి. ప్రపంచం మొత్తానికి యువ మానవ వనరులను అందించగలిగే సత్తా భారత్ కు ఉంది. మీరు నైపుణ్యం కలిగిన యువత అయితే.. పలు ఉపాధి అవకాశాలున్నాయన్నారు. వారు స్వయం సమృద్ధి సాధించగలరు. ఇది వారికి శక్తినిస్తుంది' అని పైల విష్ణు మూర్తి పేర్కొన్నారు. 'భారత్ స్వయం సమృద్ధి సాధించాల్సి ఉంది. అంటే దేశీయ ఉత్పత్తులనే వినియోగించాలి. స్వదేశీ ఉద్యమం మన భవిష్యత్తును బలపరుస్తుంది' అని వివరించారు. ఈ సమావేశంలో జిల్లా బీజేపీ కార్యదర్శి వజ్జపర్తి రఘురాం, నాయకులు మక్క నారాయణరావు, ముద్దాడ గౌరీ, త్రినాధరావు, పండూరి అప్పారావు, దౌలూరు రామకృష్ణ, పోలారావు, పోలిరాజు,ఉమ, ఎపీటీసీ ప్రతినిధి శ్రీను, ప్రదానోపాద్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మందసను అభివృద్ధి పథాన నడిపించండి

### - ఎమ్మెల్యే గౌతు శిరీషకు వినతి



**మందస, డిసెంబరు 16(వార్త):** మందసను అభివృద్ధి పథాన నడిపించాలని మందస నాయకులు పలాస ఎంఎల్ఏ గౌతు శిరీషాను కోరారు. ఈ మేరకు వారు ఒక వినతిపత్రం అందజేశారు. మందస గ్రామ ప్రజలమైన మేము మా గ్రామం విద్య, వైద్యం, క్రీడలు, పర్యాటకం, మౌలిక సదుపాయాల పరంగా మరింత అభివృద్ధి చెందడానికి కింది ముఖ్యమైన అవసరాలు తక్షణమే అవసరమై ఉన్నాయని, మీ వాటిని దృష్టికి తీసుకువస్తున్నామన్నారు. మందస ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, సామాజిక ఆరోగ్య కేంద్రంగా మార్చి, మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించాలన్నారు. గ్రామ యువత విద్యాభివృద్ధి కోసం ఒక డిగ్రీ కళాశాల, ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఏర్పాటు చేయాలని, మందస నుండి హరిపురం వరకు డబుల్ రోడ్ నిర్మించి, రవాణా సౌకర్యాలు మెరుగుపరచాలన్నారు. మందస ఆటస్థలం గ్రౌండ్ ను అభివృద్ధి చేసి, ఆధునిక ఇండోర్ స్టేడియం నిర్మించాలని, గోపాలసాగరాన్ని మినీ రిజర్వాయర్ గా మార్చి రైతులకు సాగునీటి సదుపాయం కల్పించాలని, కబ్జాకు గురైన అన్ని చెరువులను పునరుద్ధరించి మోడల్ చెరువులుగా అభివృద్ధి చేయాలన్నారు. ఆనందగిరి మెట్ట ఆలయాన్ని పర్యాటక కేంద్రం(టూరిజం స్పాట్)గా అభివృద్ధి చేయాలని, గ్రామం మొత్తం డ్రైనేజీ వ్యవస్థను సక్రమంగా ఏర్పాటు చేసి శుభ్రతను మెరుగుపరచాలని, మందసకు ప్రత్యేక గుర్తింపుగా ఉన్న మందస కోవాకు సరైన గుర్తింపు, బ్రాండింగ్ ఇచ్చి ఎగుమతులు (ఎక్సపోర్ట్) పెంచాలన్నారు. ప్రజా రవాణా సౌకర్యాలు మెరుగు పరచడానికి ఆర్టీసీ డిపో ఏర్పాటు చేయాలని, మందస గ్రామానికి అత్యవసరంగా కావాల్సిన కనీస మౌలిక అవసరాలు మాత్రమే అని మనవి చేస్తున్నామన్నారు. ఇవి అమలులోకి వస్తే గ్రామం అభివృద్ధి చెందడమే కాకుండా యువతకు ఉపాధి అవకాశాలు, రైతులకు లాభాలు, ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు లభిస్తాయని, గ్రామ ప్రజల తరఫున ఈ విన్నపాన్ని సానుకూలంగా పరిగణించి తగిన చర్యలు తీసుకోవాలని మనవి చేస్తున్నామన్నారు.

## ఉల్లాసంగా.. ఉత్సాహంగా..!

### -మందసలో సందడి చేసిన 1983 బ్యాచ్

### -ఆత్మీయంగా కలుసుకున్న క్లాస్మేట్స్

**మందస, డిసెంబరు 16(వార్త):** చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకోవడానికి ఆత్మీయ కలయికలు ఎంతగానో సహకరిస్తున్నాయి. వాట్సప్, ఫేస్ బుక్ అందుబాటులోకి వచ్చాక, ఎక్కడెక్కడో ఉన్న చిన్ననాటి స్నేహితులు, క్లాస్మేట్స్ ఒక్క చోట కలుస్తున్నారు. అప్పటి జ్ఞాపకాలను పంచుకుంటున్నారు. ఆనందంతో అలనాటి జ్ఞాపకాలు పాలుపంచుకుంటున్నారు. మందస పట్టణంలోని శ్రీరాజా శ్రీనివాస స్మారక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1983వ సంవత్సరంలో 10వ తరగతి చదువుకున్న విద్యార్థులు మందసలో అదే విద్యాలయంలో కలుసుకున్నారు. తరగతి గదుల్లో తాము చేసిన అల్లరి, ఉపాధ్యాయులతో చీవాట్లు, దెబ్బలు గుర్తు చేసుకున్నారు. తాము విద్యనభ్యసించిన విద్యాలయం అభివృద్ధి చెందడంతో ఆనందం వ్యక్తం చేశారు. ముందుగా సూర్యోదయ స్కూల్లో కలుసుకున్న పూర్వ విద్యార్థులంతా.. తాము చదవిన పాఠశాలలో కొంత సమయం ఉల్లాసంగా.. ఉత్సాహంగా.. గడిపారు. అనంతరం బారువా సముద్రం బీచ్ కు వెళ్లి.. ఆనందంగా గడిపారు. కుటుంబాల స్థితి, గతులు.. పూర్వపరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మోణంగి నాగేశ్వరరావు, కిల్లంశెట్టి లోకనాథం, కిల్లంశెట్టి నరేష్, వెంకటరావు, వడ్డి సీతారాం, త్రినాథ్, మహంతి, విష్ణు, చంద్రమోహన్, రామ్మోహన్, తిరుపతి, వసంత, సంధ్య, రేవతి, వాణిశ్రీ, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే అశోక్ కృషితో రోడ్లు మంజూరు



**సోంపేట, డిసెంబరు 16(వార్త):** గొల్లగండి గ్రామానికి ఏడు డబ్ల్యూ బి ఎం రోడ్లు మంజూరయ్యాయని గొల్లగండి మత్స్యకార సహకార సంఘం అధ్యక్షుడు గండుపల్లి చిన్న రాజారావు తెలిపారు. పంచాయతీలో మూడు గ్రామాలకు అవసరమైన రోడ్ల ప్రతిపాదనలు గూర్చి ఎమ్మెల్యేకు వినతి పత్రం అందించడంతో ఆయన ప్రత్యేక కృషితో మంజూరైన రోడ్ల నిర్మాణ పనులు గ్రామాల్లో ప్రారంభమయ్యాయని రాజారావు తెలిపారు. రోడ్ల సమస్య పరిష్కారం కావడంతో చిన్న రాజారావుతో పాటు గ్రామస్తులు మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ అశోక్ ను కలసి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

## సర్పంచ్ కుటుంబానికి ఎంపీపీ పరామర్శ



**సోంపేట, డిసెంబరు 16(వార్త):** కవిటి మండలం బైరిపురం పంచాయతీ సర్పంచ్ పుల్లట రమాదేవి (62) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని కంచిలి ఎంపీపీ పైల దేవదాస్ రెడ్డి మంగళవారం పరామర్శించారు. రమాదేవి చిత్రపటం వద్ద నివాళులర్పించి ఆ కుటుంబానికి తన ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. సర్పంచ్ భర్త పుల్లట ప్రభాకర్ రావు తో మాట్లాడి రమాదేవి మరణానికి కారణమైన పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఆయనతోపాటు కవిటి మాజీ ఏఎంసి వైస్ చైర్మన్ వై నీలయ్య పి జగదీష్ పి వైకుంఠరావు పి రాంప్రసాద్ పి హేమ శంకరరావు తదితరులు ఉన్నారు.

## పవర్ బోర్‌కు మరమ్మతులు.. ధన్యవాదాలు




**పలాస, డిసెంబరు 16(వార్త):** పోతనపల్లి వీధిలో పవర్ బోర్ మారమ్మతులకు చేసినందుకు గాను 21వ వార్డ్ కౌన్సిలర్ ప్రసాద్ రెడ్డి పలాస మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, పలాస మున్సిపల్ కమిషనర్ ఐ శ్రీనివాసులకు ధన్యవాదాలని చెప్పారు. మంగళవారం పోతనపల్లి వారి వీధిలో గత ఆరు నెలలుగా వాటర్ ట్యాంక్ మోటర్ రిపేర్ అయ్యి వినియోగం లేకుండా ఉన్నదని, ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని దీనిపై కౌన్సిలర్ గా ప్రసాద్ రెడ్డి ఫిర్యాదు చేయగా ఆ పాత మోటర్ రిపేరు కాకపోతే కొత్త మోటర్ వేయడం జరిగింది. దీనికి ధన్యవాదాలుగా మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబుకి కమిషనర్ కి డి కనకరాజుకి,ఏఈ కిరణ్ కి కృతజ్ఞతలు తెలియజేశారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## గ్రిగ్స్‌లో ఈదులవలస ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థుల ఘన విజయం

**పోలాకి, డిసెంబరు 16(వార్త):** నియోజకవర్గ స్థాయి గ్రిగ్స్ క్రీడా పోటీలలో ఈదులవలస ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి పాఠశాలకు మంచి పేరు తెచ్చారు. వివిధ క్రీడా విభాగాల్లో మొదటి స్థానాలు సాధించిన విద్యార్థులను మంగళవారం పాఠశాల ఆవరణలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ బొడ్డేపల్లి శ్రీరామ్మూర్తి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. అండర్%-%19 విభాగంలో ఫెన్సింగ్ క్రీడలో రాష్ట్రస్థాయి గోల్డ్ మెడల్ సాధించిన కె. చందును ప్రత్యేకంగా అభినందిస్తూ, భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయిలో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల విజయాలు పాఠశాల కుటుంబానికి గర్వకారణమని ఆయన పేర్కొన్నారు.



# కార్గో ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి భూములివ్వం

### -అధికారులకు తేల్చి చెప్పిన రైతులు
### -భేతాళపురంలో రైతులతో
### ఆర్డీఓ ప్రత్యేక సమావేశం



**మందస, డిసెంబరు 16(వార్త):** పచ్చని ఉద్దానంలో కార్గో ఎయిర్ పోర్ట్ నిర్మాణానికి ఒక్క అంగుళం భూమి కూడా ఇవ్వలేమని ప్రభుత్వ ఉన్నతాధికారులకు రైతులు తేల్చి చెప్పారు. మందస మండలంలోని భేతాళపురం గ్రామంలోని సచివాలయం ప్రాంగణంలో పలాస ఆర్.డి.ఓ జి.వెంకటేశ్వరరావు కార్గో ఎయిర్ పోర్ట్ బాధిత రైతులతో సమావేశంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కార్గో ఎయిర్ పోర్ట్ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బాధిత రైతులు అంగీకరిస్తే ప్రభుత్వం నుంచి లాండ్ పూలింగ్ విధానం తీసుకు వచ్చి ఎకరాకు 25సెంట్లు భూమి తిరిగి ఇస్తామని, ఏ ఒక్కరి ఇల్లు కి నష్టం లేకుండా ప్లాన్ చేశామని, జిరాయత్తు తోటల్లో ఉన్న చెట్లకు ప్రత్యేక ధర ప్రకటిస్తామని చెప్పారు. ప్రభుత్వ ధర కన్నా 2.5రెట్లు అధికంగా చేసి ప్రభుత్వం తరుపున ఇస్తామని చెప్పారు. కార్గో ఎయిర్ పోర్ట్ బాధిత రైతులు మడియా రాజేశ్వరి మాట్లాడుతూ మా అత్త మామలు ఇచ్చిన స్థిరాస్తి భూమిపై మేము బ్రతుకుతున్నామని, మా భూమిపైన ఆధారపడి ఇప్పుడు వరకు బ్రతుకుతున్నామని, మా ప్రాణాలు ఇస్తాము.. కానీ భూమి మాత్రం ఇచ్చేది లేదన్నారు. కీలు గున్నమ్మ మాట్లాడుతూ తితిలి తుఫాను వచ్చిన తర్వాత మేము చాలా నష్టపోయమని, మళ్ళీ అదే భూమిపై ఇప్పుడు వరకు కష్టపడి పనిచేసి చెట్లు పెంచి పెద్దవి చేసి పంట కాపుకు వస్తున్న సమయంలో ఇప్పుడు మా భూమిని కార్గో ఎయిర్ పోర్ట్ కి ఇవ్వమంటే ఎలా అని ప్రశ్నించారు. మీరు ఇచ్చిన డబ్బులు పది రోజుల్లో ఖర్చు చేసేస్తామని, అదే భూమి ఉంటే దానిపై మా జీవనం కొనసాగిస్తామని, ఒక్క సెంటు భూమి కూడా ఇవ్వడం లేమని అన్నారు. రైతు బత్తిని ఉమాపతి మాట్లాడుతూ గత సంవత్సర కాలం నుంచి ఇప్పటి వరకు మేము చాలా మానసిక ఒత్తిడికి లోనవుతున్నామని, మాకున్న 4ఎకరాల భూమి పోతే మేము ఎక్కడికి వెళ్ళాలని ప్రశ్నించారు. ఇదే భూమిపై మా నాన్న, ప్రస్తుతం మేము ఇప్పుడు వరకు బ్రతికామని, మా పిల్లలుకి ఉన్నతమైన చదువులు చదివిస్తున్నామన్నారు. కార్గో ఎయిర్ పోర్ట్ భూముల్లో పడని కొందరు రైతుల వాట్సప్ మెస్సేజ్ లు చూసి చాలా ఆవేదన కలుగుతుందని, ఎట్టిపరిస్థితుల్లోనూ ఒక్క అంగుళం భూమి కూడా ఇచ్చేది లేదన్నారు. రైతు గార ఆనంద్ మాట్లాడుతూ తన సొంత ఇళ్ళు కట్టడానికి డబ్బులు అవసరమైన సందర్భంలో బ్యాంక్ దగ్గరకు వెళ్తే సవాలక్ష రూల్స్ పెట్టారు.అది చూసి మాకు దగ్గరగా ఉన్న సాహుకరి దగ్గరకు వెళ్లి నాకు 5 లక్షలు రూపాయలు కావాలంటే అరగంటలో నాకు అప్పు ఇచ్చారు. అంటే భూమి విలువ ఏంత ఉందొ మీరు అర్థం చేసికోవలని మనవి చేశారు. నాకు నా స్థిరాస్తి భూమి కన్నా మరేదీ ఎక్కువ కాదని నేను ఒక్క సెంట్ భూమిని కూడా ఇచ్చేందుకు సిద్ధంగా లేమని చెప్పారు. బాధిత రైతు, కార్గో ఎయిర్ పోర్ట్ వ్యతిరేక కమిటీ మీడియా వింగ్ కన్వీనర్ బత్తిని లక్ష్మణ్ మాట్లాడుతూ నేటికి 15 నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు ఆర్.డి.ఓ కార్గో ఎయిర్ పోర్ట్ కి సంబంధించిన రైతులు ఏంతమంది ఉన్నారు.. ఏ సర్వేలు భూమిలు పోతున్నాయో.. కార్గో ఎయిర్ పోర్టుకి ఏంత భూమి కావాలో ? క్లారిటీ ఇవ్వకుండా సుమారు 20గ్రామాల్లో బాధిత రైతులందరికీ మానసికంగా ఇబ్బంది పెట్టడం సరి కాదన్నారు. సమావేశానికి వచ్చిన బాధిత రైతులు, గ్రామ కమిటీ సభ్యులు కూడా గత నెలలో అధికారులు రాంపురం సచివాలయంలో రైతులతో సమావేశంలో ఏర్పాటు చేస్తున్నాని చెప్పడంతో 23-11-2025 తేదీన మా భేతాళపురం గ్రామంలో బహిరంగ సభ ఏర్పాటు చేసి రైతులందరూ కూడా ఒక్క సెంట్ భూమి కూడా కార్గో ఎయిర్ పోర్ట్ కి ఇచ్చేది లేదని చేసిన తీర్మానం పత్రాలను చూపించామని గుర్తు చేశారు. మరోసారి గ్రామ సభ ద్వారా మీరు అన్ని హామీలను అమలు చేస్తామని చెప్పిన సరే, మా పచ్చని భూములు కన్నా మరేదీ ఎక్కువ కాదన్నారు. కార్గో ఎయిర్ పోర్ట్ భూమిలకి సంబంధం లేని ఇతరులు మా స్థిరాస్తి భూముల కోసం మాట్లాడే నైతిక హక్కు లేదని హెచ్చరించారు. ప్రత్యేక అధికారులు, రెవిన్యూ, పోలీసు అధికారులు వస్తున్నారని తెలిసి మా రైతుల ఆమోదంతో మరొక తీర్మానం రాసి వినతిపత్రం అందజేశారు. సభలో రైతులు ఆవేదనను విన్న తర్వాత అధికారులు స్పందించి తప్పకుండా అభిప్రాయాలను పై అధికారుల దృష్టిలో పెడతామన్నారు. మందస తహసీల్దార్ మిస్క శ్రీకాంత్, సచివాలయం సెక్రటరీ, వి.ఆర్. ఓ. గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కీలు తెల్లయ్య, ప్రధాన కార్యదర్శి మడియా రుషి, స్థానిక ఎంపీటీసీ సూరాడ వాసు, బత్తిని దేశయ్య, జుత్తు హేమరాజు, దున్న తిరుపతి, బొడ్డు శంకర్, సాహుకారి కృష్ణారావు, కీలు భీమరావు, సాహుకారి ఉపేంద్ర రావు, ఇరోతు దేవరాజు, బత్తిని అనుసూయమ్మ, మహిళలు, యువకులు, రైతులు పాల్గొన్నారు.

## అక్రమ కట్టడాలపై మండిపడ్డ పాలకవర్గం

### -నరసన్నపేట పంచాయతీ సమావేశంలో వాడీవేడి చర్చ



**నరసన్నపేట, డిసెంబరు 16(వార్త):** నరసన్నపేట మేజర్ పంచాయతీ పాలకవర్గ సమావేశం సర్పంచ్ అధ్యక్షతన మంగళవారం జరిగింది. పట్టణంలో ఇటీవలి కాలంలో విపరీతంగా పెరుగుతున్న అక్రమ కట్టడాలు, అనుమతులు లేకుండా చేపడుతున్న అదనపు నిర్మాణాలపై సభ్యులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అంశంపై సమావేశంలో వాడి వేడి చర్చ కొనసాగింది. అక్రమ నిర్మాణాల వల్ల పట్టణ అభివృద్ధికి ఆటంకాలు ఏర్పడుతున్నాయని, ప్రజలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని సభ్యులు పేర్కొన్నారు. స్పందించిన ఇన్చార్జ్ ఈఓ ద్రాక్షాయణి మాట్లాడుతూ, అన్ని అక్రమ కట్టడాలపై నోటీసులు జారీ చేసినట్లు, నిబంధనల ప్రకారం త్వరలోనే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇదే సమావేశంలో గ్రామ పంచాయతీ పరిధిలో తాగునీటి అవసరాలు, సరఫరా పరిస్థితిపై సభకు స్పష్టమైన వివరాలు తెలియజేయాలని ఉప సర్పంచ్ కృష్ణబాబు కోరారు. ప్రజా సమస్యల పరిష్కారంలో పారదర్శకత, బాధ్యత అవసరమని సభ్యులు అభిప్రాయపడ్డారు. మొత్తంగా ఈ సమావేశం అక్రమ నిర్మాణాల నియంత్రణ, మౌలిక సదుపాయాల మెరుగుదలపై కీలక నిర్ణయాలకు దారి చూపిందని పలువురు సభ్యులు తెలిపారు.

## చట్టాలపై అవగాహన అవసరం




**పోలాకి, డిసెంబరు 16(వార్త):** పోలాకి లోని ఒక ప్రైవేట్ ఉన్నత పాఠశాలలో మంగళవారం పోలీస్ చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శక్తి టీం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పోలాకి ఎస్ఐ రంజిత్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు సమాజంలో అమలులో ఉన్న పోలీస్ చట్టాలు, నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఎటువంటి సమస్య ఎదురైనా ధైర్యంగా ఎదుర్కొనే స్వభావాన్ని అలవాటు చేసుకోవాలని, చట్టపరమైన సహాయం తీసుకోవడంలో వెనుకాడవద్దని అన్నారు. కార్యక్రమంలో శక్తి టీం సభ్యులు శ్రీనివాస్, యశోద పోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. బాలల హక్కులు, భద్రత, చట్టపరమైన రక్షణ అంశాలపై వివరించారు. ఈ అవగాహన కార్యక్రమం విద్యార్థుల్లో చట్టాలపై స్పష్టత పెంచిందని ఉపాధ్యాయులు పేర్కొన్నారు.

## పల్స్ పోలియో విజయానికి సమన్వయమే కీలకం



**పోలాకి, డిసెంబరు 16(వార్త):** పోలాకి మండల ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఆశా, అంగన్వాడీ కార్యకర్తలకు నిర్వహించిన పల్స్ పోలియో అవగాహన కార్యక్రమం ప్రజారోగ్య పరిరక్షణలో మరో కీలక అడుగుగా నిలిచింది. పోలియో వంటి ప్రాణాంతక వ్యాధిని పూర్తిగా నిర్మూలించాలంటే క్షేత్రస్థాయిలో పనిచేసే కార్యకర్తల అవగాహన, బాధ్యతాయుత చర్యలు అత్యంత అవసరం అనే విషయాన్ని ఈ కార్యక్రమం స్పష్టంగా తెలియజేసింది. పోలాకి ఆరోగ్య విస్తరణ అధికారి నల్లి రవికుమార్ పోలియో చుక్కలు వేయడంలో తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించడం ద్వారా కార్యక్రమానికి దిశానిర్దేశం చేశారు. డిసెంబర్ 20వ తేదీన అన్ని గ్రామాలలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించడంతో పాటు, మాఫింగ్ ప్రక్రియను కూడా పూర్తిచేయాలని సూచించడం గమనార్హం. ప్రభుత్వం చేపడుతున్న ఆరోగ్య కార్యక్రమాలు విజయవంతం కావాలంటే అధికారుల సూచనలతో పాటు కార్యకర్తల నిబద్ధత, ప్రజల సహకారం కీలకం. ప్రతి చిన్నారి పోలియో చుక్కలు పొందేలా చూడడం సమాజం మొత్తానికి ఉన్న బాధ్యత. ఈ అవగాహన కార్యక్రమం ఆ దిశగా అందరినీ ఏకతాటిపైకి తెచ్చే ప్రయత్నంగా భావించవచ్చు.

## కరవంజ మోడల్ హై స్కూలుకు స్వచ్ఛ హరిత విద్యాలయంగా గుర్తింపు




**జలుమూరు, డిసెంబరు 16(వార్త):** కరవంజ మోడల్ హై స్కూలుకు రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛ హరిత విద్యాలయంగా అధికారిక గుర్తింపు ఇచ్చింది. ప్రభుత్వ పాఠశాలల్లో స్వచ్ఛత, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాల అమలును పరిశీలించేందుకు నిర్వహించిన తనిఖీల్లో భాగంగా అధికారులు ఈ పాఠశాలను పరిశీలించారు. స్వచ్ఛత ప్రమాణాలు, హరిత వాతావరణ నిర్వహణలో ఉత్తమంగా నిలిచినందుకు కరవంజ మోడల్ హై స్కూలును స్వచ్ఛ హరిత విద్యాలయంగా గుర్తిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం ఇన్చార్జ్ ప్రిన్సిపల్ పి. వాసు మాట్లాడుతూ, తమ హై స్కూలుకు ఈ గుర్తింపు లభించడం గర్వకారణమని, ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి చేసిన కృషికి ఇది ప్రతిఫలమని తెలిపారు. పాఠశాలలో పరిశుభ్రమైన తరగతి గదులు, పరిసరాల నిర్వహణ, మొక్కల పెంపకం, స్వచ్ఛతపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించే కార్యక్రమాలు అమలు చేయడం వల్లే ఈ గౌరవం దక్కిందన్నారు. స్వచ్ఛ హరిత విద్యాలయ గుర్తింపు లభించడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేస్తూ, భవిష్యత్తులో కూడా పాఠశాలను మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ గుర్తింపు ఇతర పాఠశాలలకు కూడా ప్రేరణగా నిలుస్తుందని విద్యావర్గాలు అభిప్రాయపడ్డాయి.

## సీఐటీయు మహాసభల పోస్టర్ల ఆవిష్కరణ



**జలుమూరు, డిసెంబరు 16(వార్త):** దేశవ్యాప్తంగా కార్మిక వర్గాన్ని ఐక్యపరిచి సమరశీల పోరాటాలు నిర్వహిస్తున్న సీఐటీయు పాత్ర విశేషమని మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మహాలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం జలుమూరులో సీఐటీయు మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సీఐటీయు ఏర్పాటు అయిన తర్వాత రాష్ట్రంలో తొలిసారిగా విశాఖపట్నంలో డిసెంబర్ 31 నుంచి జనవరి 4 వరకు అఖిల భారత మహాసభలు జరగనున్నాయని తెలిపారు. కార్మిక హక్కుల సాధనకు ఈ మహాసభలు దోహదపడతాయని అన్నారు. అనంతరం రాబోయే మహాసభలను ఉద్దేశించి రూపొందించిన పోస్టర్లను అధికారికంగా ఆవిష్కరించారు.

## పీఎం శ్రీ ఉన్నత పాఠశాలలో ఘనంగా సైన్స్ విజ్ఞాన ప్రదర్శన



**నరసన్నపేట, డిసెంబరు 16(వార్త):** నరసన్నపేట పీఎం శ్రీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం సైన్స్ విజ్ఞాన ప్రదర్శనను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తమ సృజనాత్మకతకు ప్రతీకగా వివిధ రకాల సైన్స్ నమూనాలను రూపొందించి ప్రదర్శించారు. శాస్త్రీయ ఆలోచనలను పెంపొందించడమే లక్ష్యంగా పాఠశాల స్థాయిలో ఈ విజ్ఞాన ప్రదర్శనను ఏర్పాటు చేసినట్లు పాఠశాల హెచ్ఎం పైడి వెంకటరావు తెలిపారు. ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు విజ్ఞాన శాస్త్రానికి సంబంధించిన అంశాలను సులభంగా వివరించి సందర్శకులను ఆకట్టుకున్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను విజేతలుగా ప్రకటించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యా కమిటీ ఛైర్మన్ వెలమల కామేశ్‌తో పాటు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు.

## ఎమ్మెల్యే శిరీషను ఘనంగా సన్మానించిన మండల సమాఖ్య

**మందస, డిసెంబరు 16(వార్త):** పలాస శాసనసభ్యురాలు గౌతు శిరీషాను మందస మండల మహిళా సమాఖ్య లీడర్లు ఘనంగా సన్మానిచ్చారు. పుష్పగుచ్చానందించి, దుశ్శాలువతో సత్కరించారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జరిగిన ప్రజా వేదికలో ఏపీఎం పైడి పైడి కూర్మారావు ఆధ్వర్యంలో కొత్త కార్యవర్గ సభ్యులు మర్యాదపూర్వకంగా కలుసుకుని సన్మానించారు. అభివృద్ధిలో ఆమె ఎంతగానో కృషి చేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వై.వెంకటరమణ, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు బావన దుర్యోధన, మందస పీఏసీఎస్ అధ్యక్షుడు తమిరియా భాస్కరరావు, బాలిగాం పీఏసీఎస్ అధ్యక్షుడు లబ్బ రుద్రయ్య, మండల మహిళా సమాఖ్య ప్రతినిధులు రవణమ్మ, శారద, శైలజ, అకౌంటెంట్ కళ్యాణి, కృష్ణకుమారి, క్లస్టర్ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.



## అందరి సహకారంతోనే కోటి సంతకాల ఉద్యమం విజయం

### - మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజల స్వరమే బలమైంది
### -పోలాకి జడ్పీటీసీ డాక్టర్ ధర్మాన కృష్ణచైతన్య



**నరసన్నపేట, డిసెంబరు 16(వార్త):** వైకాపా నాయకులు, కార్యకర్తలు, అనుబంధ విభాగాల ప్రతినిధులు, నియోజకవర్గ ప్రజల సమిష్టి సహకారంతోనే కోటి సంతకాల సేకరణ కార్యక్రమం, ర్యాలీ విజయవంతమైందని వైకాపా యువ నాయకుడు, పోలాకి జడ్పిటిసి డాక్టర్ ధర్మాన కృష్ణచైతన్య పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని, అందుకే ఎలాంటి బలవంతం లేకుండా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సంతకాలు చేశారని తెలిపారు. జిల్లాలోనే అత్యధికంగా నరసన్నపేట నియోజకవర్గంలో 60 వేల సంతకాలు నమోదు కావడం ప్రజల ఆగ్రహానికి నిదర్శనమన్నారు. ఈ విజయానికి పార్టీ నాయకులు, కార్యకర్తల అంకితభావం ముఖ్య కారణమని ఆయన కొనియాడారు. ర్యాలీని అడ్డుకోవడానికి అధికార పార్టీ పోలీసులను ప్రయోగిస్తూ అనేక ప్రయత్నాలు చేసిందని విమర్శించారు. అయినప్పటికీ పార్టీ శ్రేణులు, ప్రజలు ఎక్కడా వెనుకడుగు వేయకుండా భారీ సంఖ్యలో ర్యాలీలో పాల్గొని తమ మద్దతును స్పష్టంగా ప్రకటించారని చెప్పారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్‌లు ప్రజాభిప్రాయాన్ని గౌరవించి కనువిప్పు కలగాలని సూచించారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని తక్షణమే వెనక్కు తీసుకోవాలని డాక్టర్ కృష్ణచైతన్య డిమాండ్ చేశారు. 2029 ఎన్నికల్లో రాష్ట్రంలో వైకాపా అధికారంలోకి రావడం ఖాయమని, జగన్ మరోమారు ముఖ్యమంత్రి కావడం అనివార్యమన్నారు. ఈ వాస్తవాన్ని గ్రహించిన అధికార పార్టీ వైకాపా నాయకులు, కార్యకర్తలను నిర్బంధిస్తూ అక్రమ కేసులు నమోదు చేస్తోందని ఆరోపించారు. ఇలాంటి చర్యలకు భయపడే ప్రసక్తే లేదని, పార్టీ కార్యకర్తలకు అన్ని విధాలా అండగా ఉంటామని స్పష్టం చేశారు. ప్రజల సంకల్పమే ఈ ఉద్యమానికి బలమని, ప్రజా ప్రయోజనాల కోసం పోరాటం కొనసాగుతుందని ఆయన తెలిపారు.

## అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయండి



**పలాస, డిసెంబరు 16(వార్త):** అసంపూర్తిగా ఉన్న ఇల్లు నిర్మాణాలు పూర్తి చేయండని సోషల్ డెవలప్మెంట్ స్పెషలిస్ట్ చెన్నూరు మల్లేశ్వరరావు ఇల్లు లబ్ధిదారులకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో గల కాపువీధి లో తతంగుడు నళిని అధ్యక్షతన శ్రీ అన్నపూర్ణ సమైక్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 నుండి 2024 మధ్యలో వివిధ దశలలో ఆగిపోయిన ఇళ్లు నిర్మాణాలు పూర్తి చేయాలని తెలిపారు. కూటమి ప్రభుత్వం వివిధ వర్గాలవారికి ప్రత్యేకంగా బీసీ వారికి 50 వేలు, ఎస్సీ వారికి 50,000, ఎస్ టి వారికి 75,000లు, ఆదివాసీ గిరిజనులకు లక్ష రూపాయలు ఇస్తారని చెప్పారు. దీనిని సద్వినియోగం చేసుకొని ఇళ్లు నిర్మాణాలు పూర్తి చేయాలని తెలిపారు. సమైక్య సభ్యులంతా ఇంటింటికి వెళ్లి ప్రచారం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ పి స్వాతి సమైక్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## నియోజకవర్గ స్థాయిలో గణిత పోటీలు

**ఇచ్ఛాపురం, డిసెంబరు 16(వార్త):** మునిసిపల్ గర్ల్స్ హైస్కూల్ లో గణిత దినోత్సవం పురస్కరించుకొని గణిత ఎగ్జిబిషన్ సుమారుగా 150 గణిత ప్రాజెక్టులు కంచిలి, కవిటి, సోంపేట, ఇచ్ఛాపురం మండలాలు నుండి పాల్గొన్నాయి. ఎం ఈ వో లు కె. అప్పారావు ,ఎస్. విశ్వానాదం లు, మునిసిపల్ గర్ల్స్ హైస్కూల్ ప్రాదానోపాధ్యాయులు బి. శ్రీనివాస్ రావు ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. తర్వాత సిక్కోలు గణిత ఉపాధ్యాయ వేదిక (శ్రీకాకుళం) జి. డిలేశ్వర్ ,జి.ప్రసాద్ రావు , బి.ఆదినారాయణ మరియు ఇచ్ఛాపురం డిగ్రీ కాలేజ్ ఫిజిక్స్ లెక్చరర్ సంతోష్ కుమార్ న్యాయనిర్ణేతలు గా వ్యవహరించారు .ఈ కార్యక్రమంలో భాగంగా జూనియర్ విభాగంలో ప్రథమ స్థానంలో ఎ. పి. యమ్. యస్ సోంపేట ద్వితీయ స్థానంలో యమ్. యస్. పల్లి (కంచిలి )తృతీయ స్థానంలో యమ్. పి.యుపి స్కూల్ బలరాంపురం(ఇచ్ఛాపురం) సీనియర్ విభాగంలో ప్రథమ స్థానంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కొలిగాం (ఇచ్ఛాపురం )ద్వితీయ స్థానంలో ఎమ్. యస్. పల్లి మోడల్ స్కూల్(కంచిలి) తృతీయ స్థానంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మఖరాంపురం(కంచిలి) లు నిలిచాయి.అతిథులు చేత క్యాష్ ప్రైజ్, మొమెంటో, సర్టిఫికెట్, , మెడల్ అందించారు. ఈ కార్యక్రమంలో సోంపేట మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ డి. చిన్నాజీ వర్మ, గవర్నమెంట్ హై స్కూల్ ప్రాధానోపాధ్యయులు కె. సూర్యారావు యమ్. పి. యుపి స్కూల్ బి.తోటూర్ ప్రాధానోపాద్యయులు వి. సరోజినీ పాల్గొన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు ఇంతటి ఘనవిజయాన్ని సాధించినందుకు గణిత ఉపాధ్యాయులు అందరికీ మేథ్స్ ఫోరాం తరుపున మండల ప్రతినిధి కాగాపు తేజేశ్వర్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## స్వచ్ఛ హరిత విద్యాలయంగా మోడల్ ప్రాథమిక పాఠశాల ఎంపిక

**జలుమూరు, డిసెంబరు 16(వార్త):** జలుమూరు మోడల్ ప్రాథమిక పాఠశాలను స్వచ్ఛ హరిత విద్యాలయంగా రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం మాధవరావు, ఉపాధ్యాయుడు మెండ రామారావు మాట్లాడుతూపాఠశాలలో విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక వసతులు, పరిశుభ్రత ప్రమాణాలు, పచ్చదనాన్ని పెంపొందించే కార్యక్రమాలు సమర్థవంతంగా అమలు చేయడం వల్లే ప్రభుత్వ గుర్తింపు లభించిందని తెలిపారు. విద్యార్థులకు అనుకూలమైన వాతావరణం, శుభ్రమైన తరగతి గదులు, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం, పర్యావరణ పరిరక్షణ చర్యలపై ప్రత్యేక దృష్టి సారించామని పేర్కొన్నారు. ఈ క్రమంలో తమ పాఠశాలను స్వచ్ఛ హరిత విద్యాలయంగా ఎంపిక చేయడం పట్ల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాధవరావు పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులను అభినందిస్తూ, ఇతర పాఠశాలలకు ఇది ఆదర్శంగా నిలుస్తుందని తెలిపారు.




## పాఠశాల రికార్డులు క్రమబద్ధీకరించాలి



**నరసన్నపేట, డిసెంబరు 16(వార్త):** ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న అన్ని రికార్డులను ఎప్పటికప్పుడు పూర్తిగా అప్డేట్ చేసి ఉంచాలని ఎంఈఓ దాలి నాయుడు ఉపాధ్యాయులకు ఆదేశించారు. మంగళవారం నరసన్నపేట మండలం కుమ్మరిపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యాశాఖ ఆదేశాల మేరకు నిర్వహించాల్సిన రికార్డుల స్థితిగతులను పరిశీలించి, లోపాలు ఉంటే వెంటనే సరిదిద్దాలని సూచించారు. పాఠశాలలో ఉన్న మౌలిక వసతులపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అలాగే మధ్యాహ్నం భోజన పథకం అమలు తీరును తనిఖీ చేసి, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందేలా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈ తనిఖీ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# నరసన్నపేటలో ఘనంగా కార్గిల్ విజయ్ దివాస్

### -యుద్ధ వీరులకు మాజీ సైనికుల ఘన నివాళి

**నరసన్నపేట, డిసెంబరు 16(వార్త):** నరసన్నపేటలో కార్గిల్ విజయ్ దివాస్ వేడుకలు మాజీ సైనికుల యూనియన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యూనియన్ అధ్యక్షులు దుప్పట్ల మురళి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 1971 భారత%–%పాకిస్తాన్ యుద్ధంలో భారత సాయుధ దళాలు సాధించిన చారిత్రాత్మక విజయాన్ని స్మరించుకునేందుకు ప్రతి సంవత్సరం డిసెంబర్ 16న విజయ్ దివస్‌ను దేశవ్యాప్తంగా జరుపుకుంటారని తెలిపారు. డిసెంబర్ 16, 1971న ఢాకాలో పాకిస్తాన్ సైన్యాధిపతి జనరల్ అమీర్ అబ్దుల్లా ఖాన్ నియాజీ భారత సైన్యం ఎదుట లొంగుబాటు పత్రంపై సంతకం చేయడం ద్వారా యుద్ధానికి ముగింపు పలికిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఈ చారిత్రాత్మక ఘటనలో 93 వేలకుపైగా పాకిస్తాన్ సైనికులు భారత సైన్యం మరియు బంగ్లాదేశ్ ముక్తి బాహిని సంయుక్త దళాలకు లొంగిపోయారని తెలిపారు. ఇది రెండో ప్రపంచ యుద్ధం తరువాత జరిగిన అతిపెద్ద సైనిక లొంగుబాటుగా చరిత్రలో నిలిచిపోయిందన్నారు. మొత్తం 13 రోజుల పాటు సాగిన ఈ యుద్ధం తూర్పు పాకిస్తాన్ విముక్తికి దారి తీసి, బంగ్లాదేశ్ అనే కొత్త స్వతంత్ర సార్వభౌమ దేశం ఆవిర్భావానికి కారణమైందని వివరించారు. ఈ యుద్ధంలో సుమారు 3,900 మంది భారతీయ సైనికులు ప్రాణాలు అర్పించి దేశ గౌరవాన్ని నిలబెట్టారని, వారి త్యాగాలను దేశం ఎప్పటికీ మరిచిపోదని అన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షులు పొగటి జానకిరామ్, సెక్రటరీ ఆ రంగి



ఆనందరావు, ట్రెజరర్ పంగలక్ష్మణరావు, ఈసీ సభ్యులు ఎన్. మల్లేశ్వరరావు, పెనుగూడూరు రమణ, ఏ. చంద్రరావు, డి. రామారావు, బోర వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు. అలాగే పలువురు మాజీ సైనికులు హాజరై వీర జవాన్లకు ఘన నివాళులు అర్పించారు.

## ఆంగ్ల భాష నైపుణ్యం పెంపే లక్ష్యంగా స్పెల్ బీ పరీక్షలు: ఎంఈఓ మాధవరావు



**జలుమూరు, డిసెంబరు 16(వార్త):** ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో ఆంగ్ల భాషపై పట్టు సాధించే ఉద్దేశంతో స్పెల్ బి పరీక్షలు నిర్వహిస్తున్నామని ఎంఈఓ బమ్మిడి మాధవరావు తెలిపారు. మంగళవారం జలుమూరు మండల కేంద్రంలోని మోడల్ ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న స్పెల్ బి పరీక్షలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఒకటవ తరగతి నుంచి ఐదవ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఈ పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. చిన్న వయసు నుంచే ఆంగ్ల భాషపై అవగాహన పెంచడం ద్వారా విద్యార్థుల్లో ధైర్యం, ఉచ్చారణ నైపుణ్యం, పదసంపద అభివృద్ధి చెందుతాయని ఆయన అన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఆంగ్ల భాషలో ప్రావీణ్యం సాధించేలా ఇటువంటి విద్యా కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని ఎంఈఓ పేర్కొన్నారు.

# ఉపాధి వేతనాల చెల్లింపులో వైఫల్యం

### - ప్రభుత్వం నిర్లక్ష్యంపై రెడ్డి శాంతి ధ్వజం




**కొత్తూరు, డిసెంబరు 16(వార్త):** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పని చేసిన కూలీలకు వేతనాలు చెల్లించడంలో ప్రస్తుత టీడీపీ కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైఎస్ఆర్సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆవేదన వ్యక్తం చేశారు. రోజూ శ్రమ ఆధారంగా జీవించే లక్షలాది మంది ఉపాధి హామీ కూలీలను ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని ఆమె విమర్శించారు. సకాలంలో వేతనాలు చెల్లించకపోవడం వల్ల పేద కార్మికులు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వేతనాల చెల్లింపులో జాప్యం పేదల పట్ల ప్రభుత్వానికి ఉన్న నిర్లక్ష్యాన్ని, నిరంకుశ వైఖరిని స్పష్టంగా చూపిస్తోందని రెడ్డి శాంతి అన్నారు. ఉపాధి హామీ వేతనాలు పేద కుటుంబాల జీవనాధారమని, వాటిని కూడా నిలిపివేయడం దురదృష్టకరమని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పని దినాల సంఖ్యను గణనీయంగా తగ్గించడం వల్ల గ్రామీణ కుటుంబాలు ఆదాయాన్ని కోల్పోయాయని ఆమె ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 18.63 లక్షల %చీ=జు+ూ% జాబ్ కార్డులు రద్దు చేయడం వల్ల 7.48 లక్షల కుటుంబాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయని వెల్లడించారు. వేతనాలు చెల్లించకపోవడంతో కార్మికులు ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లే పరిస్థితి ఏర్పడిందని, ఇది గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు పెద్ద ముప్పుగా మారుతోందని హెచ్చరించారు. పేద కార్మికుల కష్టాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణమే స్పందించి, పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని ఆమె డిమాండ్ చేశారు.

## ఘనంగా అయ్యప్ప స్వామి తిరువీధి



**ఇచ్ఛాపురం, డిసెంబరు 16(వార్త):** దనుర్మషం ప్రారంభం సందర్భంగా అయ్యప్ప స్వామి కి అభిషేకం తిరువిదిమరియు భజన నిర్వహించారు. తేలుకుంచి గ్రామం లో పిన్నింటి దశరధి గృహం లో ఆసి కృష్ణ గురుస్వామి ఆధ్వర్యంలో అంగరంగ వైభావంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

## కె.శాసనం స్కూల్‌లో మధ్యాహ్న భోజనం తనిఖీ



**ఇచ్ఛాపురం, డిసెంబరు 16(వార్త):** కె.శాసనం హైస్కూల్‌లొ విద్యార్థులకు ఐడెంటేటికార్డులు పంపిణి చేశారు. అలాగే స్కూల్ లొ నిర్వహిస్తున్న డొక్కా సీతాయమ్మ మద్యాన భోజన పథకాన్ని ఎంపిపి బోర పుష్ప పరిశీలించారు.

## కలెక్టరకు ఇత్తడి వస్తువుల బహుకరించిన బుడితి ఇత్తడి కళాకారులు



**సారవకోట, డిసెంబరు 16(వార్త):** బుడితిలోని ప్రసిద్ధ కంచు–ఇత్తడి నైపుణ్య కళాకారులు తయారుచేసిన విలువైన హస్తకళా వస్తువులను జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్‌కు సోమవారం బహుమతిగా అందజేశారు. శ్రీకాకుళంలో కలెక్టరును మర్యాదపూర్వకంగా కలిసిన సందర్భంగా కళాకారులు కింతాడ బుజ్జి, అద్దాల రామకృష్ణ తదితరులు తమ నైపుణ్యానికి నిదర్శనంగా రూపొందించిన వస్తువులను అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ బుడితి కళాకారుల ప్రతిభపై ప్రశంసలు కురిపించారు. కంచు, ఇత్తడి వస్తువుల తయారీలో ఉన్న సంప్రదాయ నైపుణ్యం ప్రశంసనీయం అని పేర్కొంటూ, ఈ కళను మరింత అభివృద్ధి చేసుకుని విస్తృత స్థాయిలో గుర్తింపు పొందాలని కళాకారులకు సూచించారు. స్థానిక హస్తకళలకు ప్రోత్సాహం లభిస్తే కళాకారుల జీవనోపాధి మరింత మెరుగుపడుతుందని ఆయన అన్నారు.

## మండల స్థాయి గణిత పరీక్షల్లో ప్రతిభ చాటిన కాశీబుగ్గ జడ్పీ పాఠశాల విద్యార్థులు



**పలాస, డిసెంబరు 16(వార్త):** కాశీబుగ్గ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మండలస్థాయిలో జరిగిన గణిత పరీక్షల్లో ప్రతిభ చాటారు.

మూడు తరగతుల స్థాయిలో జరిగిన గణిత పరీక్షల్లో 10వతరగతి నుంచి కీర్తిపండా మొదటిస్థానం సాదించగా, కేశవరావు, కార్తీక్ పూర్ణచంద్రరావులు ద్వితీయ, తృతీయ, కన్సోలేషన్ బహుమతులు సాధించారు. 10వతరగతి నుంచి మనోహర్ ప్రథమస్థానం సాదించగా, కళ్యాణ్ ద్వితీయ స్థానం, 9వతరగతి నుంచి ఢిల్లీ శరణ్ మొదటిస్థానం, హర్షవర్ధన్ సాయిపర్షితు ద్వితీయతృతీయ స్థానాలు సాదించారు. ఈ సందర్భంగా ప్రతిభ సాధించిన విద్యార్థులను హెచ్ఎం చిన్నంనాయుడు, గణిత ఉపాధ్యాయులు కిల్లి వెంకటరావు, దారకరామారావు, ఛాయామోహన్, వెంకటరావు, కిషోర్, నిర్మలలు అభినందించారు.

## యువకుల రక్తదానం



**ఇచ్ఛాపురం, డిసెంబరు 16(వార్త):** ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లాలో పి ఎన్ పురం గ్రామంలో శ్రీ ధాం ఆలూమిని అసోసియేషన్, జి ఎస్ ఫౌండేషన్ సభ్యులు,తలసేమియా పిల్లలు, గర్భిణుల కోసం గ్రామంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరంలో 40 మంది యువకులు పాల్గొని ప్రాణ దాత బ్లడ్ బ్యాంకులో రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ చుట్టు ప్రక్కలయువత పాల్గొన్నారు.

## జలుమూరు పీహెచ్‌సీని తనిఖీ చేసిన ఎంపీడీవో చిన్నమ్మడు

**జలుమూరు, డిసెంబరు 16(వార్త):** జలుమూరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం జలుమూరు ఎంపీడీవో బి. చిన్నమ్మడు పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆరోగ్య సేవలు సక్రమంగా అమలవుతున్నాయా లేదా అనే అంశాలపై వైద్యాధికారి సంధ్యారాణిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలో సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించి, రోజువారీగా అందిస్తున్న సేవలు, సిబ్బంది పనితీరు తదితర అంశాలపై చర్చించారు. అనంతరం వైద్య కేంద్రానికి సంబంధించిన రికార్డులను పరిశీలించి, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా బాధ్యతతో పనిచేయాలని సిబ్బందికి సూచించారు.



## పాఠశాల వద్ద బోరుబావికి శంకుస్థాపన

**సోంపేట, డిసెంబరు 16(వార్త):** కంచిలి మండలం సాలిన పుట్టుగ గ్రామంలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బోరుబావి నిర్మాణానికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత వజ్జ మృత్యుంజయరావు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఎంతోకాలంగా పాఠశాలలో మంచినీటి సదుపాయం లేని సమస్యను ఉపాధ్యాయ సిబ్బంది గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకురావడంతో మృత్యుంజయరావు తన సొంత నిధులు లక్షన్నర రూపాయలు వెచ్చించి బోరు బావి నిర్మాణ పనులకు కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. దీని పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏలుసూరి అప్పారావు, వజ్జ కృష్ణారావు, సాలిన భాస్కరరావు, మద్దిల త్రినాధ, సాలిన బాలస్వామి, తమరాల లక్ష్మణమూర్తి, సాలిన లక్ష్మణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



## కొత్తూరు తహసీల్దార్‌గా .. శ్యామ్‌కుమార్ బాధ్యతల స్వీకరణ

**కొత్తూరు, డిసెంబరు 16(వార్త):** కొత్తూరు మండలానికి కొత్త తహసీల్దార్‌గా వి.శ్యామ్‌కుమార్ మంగళవారం అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయనను కార్యాలయంలో అధికారులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వి. శ్యామ్‌కుమార్ మాట్లాడుతూ, ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ సకాలంలో చేరేలా కృషి చేస్తానని తెలిపారు. రెవెన్యూ సంబంధిత సమస్యలను వేగంగా పరిష్కరించి ప్రజలకు న్యాయం చేయడమే తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, భూ సమస్యలు, సర్టిఫికేట్‌లు, ఫిర్యాదుల పరిష్కారంలో పారదర్శకతతో పని చేస్తానని హామీ ఇచ్చారు. మండల అభివృద్ధికి అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది సమన్వయంతో కృషి చేస్తామని తహసీల్దార్ స్పష్టం చేశారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546